క్లుప్తంగా

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

పాల్వంచరూరల్: పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ హిందువులను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, నోటిని అదుపులో పెట్టుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాపాక రమేష్, వర్సుదాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంరూరల్: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాములు శ్రీను వేధించి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు మంగళవారం ఎస్పీ రోహిత్‌రాజుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎస్సై శ్రీనుపై సీఐ జితేందర్‌రెడ్డి, కొందరు సిబ్బంది కుల వివక్షతో వేధించడంతోనే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఎస్సై కుటుంబీకులు మద్దెల శివకుమార్, మందా హన్మంతు, పీక కృష్ణ, పూల రవీందర్, శ్రీను, శ్రీనివాస్, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

4న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిలిపివేసి తెలంగాణలోని గనులను సింగరేణికే కేటాయించాలనే డిమాండ్‌తో ఈనెల 4న కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. కొత్తగూడెంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... నిరసనలో ఐఎన్‌టీయూసీ బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేటీపీఎస్ ఆస్పత్రిలో డాక్టర్ల నియామకం

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: కేటీపీఎస్ ఆస్పత్రిలో హైదరాబాద్ కార్పొరేట్ ఆస్పత్రి నుంచి ఐదుగురు డాక్టర్లను నియమించాలని జెన్‌కో యాజమాన్యం గతంలో ఒప్పందం చేసుకుంది. ఐదుగురిలో ఒక్క డాక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమస్యపై 'వైద్యసేవలు అంతంతే 'అనే శీర్షికన జూలై1వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి జెన్‌కో అధికారులు స్పందించారు. ఈ మేరకు మరో ఇద్దరు డాక్టర్లను నియమించగా మంగళవారం వైద్యులు సాయికార్తీక్, సందీప్ విధుల్లో చేరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాజనీతిశాస్త్రం, కంప్యూటర్ పోస్టులకు ఒక్కో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జూలై 3న హాజరైన అభ్యర్థులకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వివరించారు.

వృత్తి నైపుణ్యంపై శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది దేహదారుఢ్యం, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎండీ.జాకీర్ హుస్సేన్ తెలిపారు. కొత్తగూడెంలోని ఎస్ అండ్ పీసీ ట్రెనింగ్ సెంటర్‌లో 77వ బ్యాచ్ శిక్షణను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేయడంతో పాటు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి

జూలూరుపాడు: 0–5 సంవత్సరాల పిల్లల్లో అతిసార వ్యాధి (డయేరియా) లక్షణాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్లు పోటు వినోద్, తేజశ్విని, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి: వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. సీజన్‌లో వచ్చే వ్యాధులను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగు బండి వెంకటేశ్వర్లు, గుజ్జ విజయ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో సమస్యలు

- అరకొర తరగతి గదులతో ఇక్కట్లు
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు
- ఇబ్బంది పడుతున్న బాలికలు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు



ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లిలోని బాలికల ఆశ్రమ పాఠశాల

పాల్వంచరూరల్: బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏళ్ల తరబడి విద్యార్థినులను పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఐటీడీఏ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలో మారుమూల గిరిజన ప్రాంతమైన ఉల్వనూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలో 1నుంచి 5వ తరగతి వరకు 135మంది విద్యార్థినులు ఉన్నారు. ఇంతమందికి మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి.

విద్యార్థినులు తరగతి గదిలో కుర్చోవడానికి కనీసం బల్లలు కూడా లేవు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక బయటికి వెళ్తున్న పరిస్థితి. 2011లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు సగం చేసి అసంపూర్తిగా వదిలేశారు.

మరో మూడు గదులు అవసరం...

పాఠశాలలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకే తరగతి గదిలో ఎక్కువ మంది కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థినులకు సౌకర్యంగా ఉండాలంటే మరో మూడు అదనపు తరగతి గదులను నిర్మాణం చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం

గిరిజన విద్యార్థులంటే నిర్లక్ష్యం..



మారుమూల గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలో బాలికలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. గిరిజన విద్యార్థులు అంటే అధికారులకు నిర్లక్ష్యం ఉంది. నిధులు మంజూరు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– సపావత్ సురేష్, లక్ష్మీదేవిపల్లి

మరుగుదొడ్లు నిర్మించాలి.



బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో నిత్యం విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి విద్యార్థినుల సౌకర్యార్థం వెంటనే మరుగుదొడ్లను మంజూరు చేయాలి.

– బొడా భాస్కర్, లక్ష్మీదేవిపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులతో పాటు బాలికలకు మరో రెండు మూత్రశాలలు, మరుగుదొడ్లు మంజూరు చేయాలని పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. త్వరలో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి.

– కె.సీతమ్మ, పాఠశాల హెచ్‌ఎం, ఉల్వనూరు

ఆర్టీసీ డిపోలో రోజుకు 'రూ.లక్ష లక్ష్యం'

చుంచుపల్లి: డిపో పరిధిలో రోజుకు రూ.లక్ష అదనపు ఆదాయం తేవాలనే ఉద్దేశ్యంతో ఆర్టీసీలో మంగళవారం రూ.లక్ష లక్ష్యం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీటీఓ కిషన్‌రావు హాజరై మాట్లాడారు. ఆర్టీసీ సంస్థలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ సిబ్బంది ముందుకు సాగాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితో డిపోలను లాభాల బాటలో నడిపించాలని చెప్పారు. ఇందులో భాగంగా ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉత్తమ ఉద్యోగులకు రివార్డు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, సిబ్బంది శ్రావణ్ కుమార్, విజయలక్ష్మి, సునీత, ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



రివార్డు అందజేస్తున్న డీటీఓ కిషన్‌రావు

రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందజేయాలి

ఇల్లెందు: అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష అందజేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం ఇల్లెందు ప్రాజెక్టు కార్యాలయంలో సంఘం తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ మాట్లాడుతూ... అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి ఈ నెల 4న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని కోరారు.

టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నియామకం



కిరణ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సంయుక్త కార్యదర్శిగా కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు కమిటీ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు కార్పొరేట్ ఉపాధ్యక్షుడిగా తుమ్మ శ్రీనివాస్, కార్యనిర్వహక కమిటీ సభ్యుడిగా కనుకుంట్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సుజాతనగర్: విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల సందర్శనలో భాగంగా ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. విద్యా సంస్థల్లో తాగునీరు, టాయిలెట్ తదితర సౌకర్యాలు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనిల్ కుమార్, సాయి, పునీత్ కుమార్, చరణ్ పాల్గొన్నారు.

పోడు రైతులకు రుణాలివ్వండి

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన రైతులకు పంపిణీ చేసిన పోడు భూములకు పంట రుణాలు మంజూరు చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు బ్యాంక్ అధికారులను కోరారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కిన్నెరసాని) బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ కొరనాల వెంకటతేజ, అసిస్టెంట్ మేనేజర్ కె.ప్రకాశ్‌రావుతో మంగళవారం ఉల్వనూరు, బంజర, మల్లారం, రేగులగూడెం, లక్ష్మీదేవిపల్లి చంద్రాలగూడెం గ్రామాలకు చెందిన రైతులతో కలిసి డీసీఎంఎస్ చైర్మన్ మాట్లాడారు. ఎన్నో సంవత్సరాల తర్వాత గిరిజన రైతులకు పోడుపట్టాలు వచ్చాయని వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పోడు రైతులకు పంట రుణాలు అందజేయాలని కోరారు. పెట్టుబడులు లేక రైతులు ప్రతీ సంవత్సరం నష్టపోతున్నారని పెట్టుబడి కోసం పంట రుణాలు అందజేస్తే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, వాసం రుద్ర, స్వర్ణలత, ముగితే ముసలయ్య, గండు భరత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఇల్లెందు: పట్టణంలో వాహనదారులు భయపడుతున్నారు. అడుగడుగున పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. లైసెన్స్, నంబర్ ప్లేట్, బీమా లేని వాహనాలకు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో సీఐ బత్తుల సత్యనారాయణ, డీఎస్పీ ఎన్. బానుచంద్ర, ఎస్ఐ సందీప్‌కుమార్‌లు వాహనాలు తనిఖీలు చేశారు. 25 వాహనాలను గుర్తించి వారికి జరిమానాలు విధించారు. డీఎస్పీ చంద్రభాను మాట్లాడుతూ.. ఇక మీదట ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం తనిఖీలు ఉంటాయని తెలిపారు. సైబర్ నేరాలు, కొత్త పోలీసు చట్టాలను వివరించారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ఇల్లెందు: కస్తూర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ, కస్తూర్బా గాంధీ పాఠశాలల నాన్ టీచింగ్ స్టాఫ్ జిల్లా కార్యదర్శి గోనెల రమేష్ ఆరోపించారు. మంగళవారం ఇల్లెందు ఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్కర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 470 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సుమారు ఐదువేల మంది నాన్‌టీచింగ్ స్టాఫ్ పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీరోజు 12 గంటల పాటు విద్యార్థుల కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్‌ను పర్మనెంట్ చేస్తామని వాగ్దానాలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. నాన్ టీచింగ్ స్టాఫ్ బేసిక్ పేమెంట్ నిర్ణయించి వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులకు రూ.10 లక్షల బెనిఫిట్ అందజేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. తదితర డిమాండ్ల సాధనకు జూలై 3న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని కోరారు. పాయం వెంకన్న, అన్న నరేష్, పాండు, బానోతు నగేష్ పాల్గొన్నారు.

విప్లవ శ్రేణులకు విశ్వనాథం ఆదర్శం

ఇల్లెందురూరల్: ప్రాణం విడిచే వరకు విప్లవకారుడిగా జీవనం సాగించిన విశ్వనాథం విప్లవ శ్రేణులకు ఆదర్శంగా నిలిచాడని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. 21పిట్ ఏరియాలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు విశ్వనాథం భౌతికకాయంపై న్యూడెమోక్రసీ, సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్ నాయకులు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జె.సీతారామయ్య అధ్యక్షతన ఏర్పాటైన సంతాప సభలో ఆయన మాట్లాడారు. అనంతరం విశ్వనాథం అంతిమయాత్రలో పలు రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్: కొత్తగూడెం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని సూరారం, పాండురంగాపురం తండాల్లో మంగళవారం జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పలువురు పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలకు తమపార్టీ అండదండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ముత్యాల విశ్వనాథం, ఎస్‌కే సాబీర్‌పాషా, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

సుజాతనగర్: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పని చేస్తేనే అభివృద్ధి జరుగుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం సుజాతనగర్ మండల కేంద్రంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో అధికారులే కాకుండా ప్రజలు కూడా దృష్టి సారించాలన్నారు. రాజకీయ ప్రమేయం, పైరవీలకు తావివ్వొద్దన్నారు. ప్రజలు తమ సమస్యను ప్రభుత్వ కార్యాలయాల్లో చెప్పుకునే వాతావరణం కల్పించాలని చెప్పారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



క్రమబద్ధీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: విధులు సమర్థవంతంగా నిర్వహించి జీవితంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మోహన్, కృష్ణకుమారి, హర్షిణి, ఉమాదేవిల విధులు క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వు పత్రాలను ఎమ్మెల్యే మంగళవారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామపంచాయతీల సమగ్రాభివృద్ధిలో భాగస్వాములై ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇల్లెందు, టేకులపల్లి ఎంపీడీఓలు ధన్‌సింగ్, రవీందర్‌రావు, ఎంపీఓ చిరంజీవి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు నాటండి..

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీల్లోని పల్లె ప్రకృతి వనాల్లో చనిపోయిన మొక్కల స్థానాల్లో కొత్తగా మొక్కలను నాటాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర రెడ్డి ఆదేశించారు. మండల పరిధి తోగ్గూడెం, పెద్దమ్మగుడి వద్ద ప్లాంటేషన్ ఏర్పాటు కోసం చదును చేసిన ప్రదేశాలను మంగళవారం ఎంపీడీఓ, పెద్దమ్మ గుడి ఈఓ ఎన్.రజనీకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మొక్క నాటి మాట్లాడారు. వనమహోత్సవం ప్రారంభమయ్యే నాటికి అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటడానికి వీలుగా గుంతలు తీసే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గతంలో రహదారుల పక్కన వేసిన మొక్కలు చనిపోయినట్లయితే వాటిని గుర్తించి తిరిగి మొక్కలను నాటాలని సూచించారు. ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శులు సాయిరాం, రవి, శ్రీను, శంకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

5వ తేదీ నుంచి ఆందోళనలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 5వ తేదీ నుంచి 12 వరకు ఆందోళనలు చేపట్టనున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 5న కలెక్టరేట్ల వద్ద ధర్నా, 8 నుంచి 12 వరకు సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ఎదుట దీక్షలు చేపట్టడంతో పాటు జూలై 17న హైదరాబాద్‌లో వేలం వేసే కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని వెల్లడించారు. కాగా, గతేడాది డిసెంబర్ 27న జరిగిన ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గుర్తింపు సంఘంగా ఎంపికైన యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వడంలో జాప్యం చేస్తోందని రాజ్‌కుమార్ ఆరోపించారు. వారంలోగా గుర్తింపు పత్రం ఇవ్వకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మిరియాల రంగయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి, రమణమూర్తి, క్రిస్టోఫర్, కత్తెర రాములు, సందెబోయిన శ్రీనివాస్, గట్టయ్య, హుమాయిన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలం నిలిపివేయాలి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఆవిర్భావం నుంచి దాదాపు 130 ఏళ్ల నుంచి సంస్థను నమ్ముకుని వేలాది కుటుంబాలు పని చేస్తున్నాయని, ఈ తరుణంలో అన్నీ ప్రైవేట్‌పరం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో తోడేటి నాగేశ్వరరావు, కె.సారంగపాణి, గొనీ నాగేశ్వరరావు, డి.ప్రసాద్, అంజయ్య, మోహన్, రమేష్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఐదేళ్లూ అధికార పక్షమే..

- అయినా వెంటాడిన నిధుల లేమి
- అరకొర పనులతో కరిగిపోయిన కాలం
- నేడు పాలకవర్గం చివరి సమావేశం



నిర్మించి ఏళ్లు గడుస్తున్నా తెరుచుకోని గిరిజన భవన్

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండల పరిషత్ పాలకవర్గం 2019 జూన్‌లో ఎన్నికైంది. ఆగస్టు 6న పదవీ బాధ్యతలు చేపట్టింది. మండల పరిషత్‌కు జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి 12 మంది, న్యూడెమోక్రసీ నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్‌గా ఒకరు ఎంపీటీసీలుగా విజయం సాధించారు. శాసనసభకు ఎన్నికలు జరగడానికి కొన్ని నెలల ముందు బీఆర్‌ఎస్ నుంచి 12 మంది ఎంపీటీసీలు కాంగ్రెస్ గూటికి చేరడంతో అనూహ్యంగా ఎంపీపీ, వైస్‌ఎంపీపీ పదవులు కూడా కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. ఇలా పాలకవర్గం ఐదేళ్లపాటు జెండా మార్పులు మినహా అధికార పక్షంలోనే కొనసాగింది. ఐదేళ్ల పాలనలో బుధవారం చివరి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

నామమాత్రంగా సమావేశాలు..

మూడు నెలలకోసారి నిర్వహించే మండల పరిషత్ సమీక్ష సమావేశాలకు మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడం.. కీలక శాఖల అధికారులు సైతం కిందిస్థాయి సిబ్బందిని పంపడం పరిపాటిగా మారింది. ఈ విషయంలో కాసింత గట్టిగా నిరసన తెలిపిన ఎంపీటీసీలు వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలుమార్లు తీర్మానాలు చేశారు. కానీ ఐదేళ్లలో ఏ ఒక్క అధికారికీ ఉన్నతాధికారుల నుంచి నోటీసు అందకపోవడం గమనార్హం. మండలం యూనిట్‌గా సమస్యలపై చర్చించాల్సిన సమావేశంలో అధికారులు నివేదికలతో రావడం.. వాటిని చదవడం.. వెళ్లిపోవడం.. పరిపాటిగా మారింది. ఇక పోడు భూముల సమస్య, విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పనపై పలువురు ఎంపీటీసీలు అధికారులను నిలదీయడం మినహా సమావేశంలో చర్చ ద్వారా పరిష్కరించుకున్న సమస్యలు లేవనే చెప్పాలి.

అస్తవ్యస్తంగా కార్యాలయం..

ఐదేళ్లు అధికార పక్షంలో కొనసాగిన పాలకవర్గం శిథిలావస్థకు చేరుకున్న భవనం స్థానంలో నూతన నిర్మాణం కోసం నిధులు సాధించలేకపోవడం విచారకరం. ఐదేళ్లలో కార్యాలయానికి రెండుసార్లు మరమ్మతులు చేయించినా నేడు యథాస్థితికి చేరుకోవడం గమనార్హం. ప్రస్తుతం స్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోనన్న భయాందోళనలో ఉద్యోగులు ఉన్నారు. ఇక కార్యాలయ ఆవరణలో కొద్దిపాటి ఆదాయం అందిస్తున్న వ్యాపార సముదాయానికి నెలలు గడుస్తున్నా టెండర్ నిర్వహించకపోవడం, మంజూరైన నిధులతో ప్రారంభించిన మరో వ్యాపార సముదాయం నిధుల లేమి పేరుతో అసంపూర్తిగానే వెక్కిరిస్తోంది.

పర్యవేక్షణ లోపం...


ప్రతీ గ్రామపంచాయతీకి కార్యదర్శులను, కంప్యూటర్ ఆపరేటర్లను, మల్టీపర్పస్ వర్కర్లను ప్రభుత్వం నియమించింది. పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో అధికారిని నియమించింది. ఎంపీడీఓ సైతం గ్రామపంచాయతీలలో పర్యటించి పాలనను పర్యవేక్షించే అధికారం ఉంది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కార్యదర్శులలో అత్యధికులు విధులకు హాజరయ్యే తక్కువ సమయంలో అత్యధిక భాగం మండల కేంద్రంలోనే గడపడం గమనార్హం. ఇది తెలిసినా పాలకవర్గం పట్టించుకోకపోవడం, సర్వసభ్య సమావేశాలలో లోతుగా చర్చించకపోవడం వంటి కారణాలతో ఐదేళ్ల గడిచినా పల్లెపాలనపై పట్టు సాధించలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. ఎంపీటీసీగా పంచాయతీ పాలనలో భాగస్వాములైనా పంచాయతీ పాలన, ఆదాయ వ్యయాలపై ఏనాడూ సమీక్షించిన దాఖలు లేకపోవడం విచారకరం.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

మండల పరిషత్, గ్రామపంచాయతీలలో ప్రారంభించిన పనులు నిధుల లేమితో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు కార్యాలయ భవనాల నిర్మాణం ప్రారంభించి ఏడాది గడుస్తున్నా నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఏటా మంజూరవుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను మండలం యూనిట్‌గా ఖర్చు చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ కొంత ప్రాంతానికి పరిమితం చేయడం విమర్శలకు తావిచ్చింది.

మండలంలో రూ.20 కోట్ల వ్యయంతో అట్టహాసంగా నిర్మించిన యువజన శిక్షణ కేంద్రం భవనం క్రమంగా ప్రైవేటు శిక్షణ సంస్థల చేతుల్లోకి వెళ్లినా ప్రశ్నించేవారే లేకపోవడం ఈ ప్రాంత నిరుద్యోగులకు శాపంగా మారింది. గిరిజన భవన్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి తేవాలన్న ఆలోచన చేయకపోవడం విడ్డూరం. దశాబ్దాలు గడుస్తున్నా అత్యధిక విస్తీర్ణంలో రైతులు వర్షాధారంగా పంటలు సాగు చేసుకుంటున్నా.. మండల సరిహద్దులో శంకుస్థాపన చేయబడిన సీతారామ ప్రాజెక్టు దూరమైనా గొంతెత్తని రైతాంగం నుంచి మాత్రం పలు విమర్శలను మూటగట్టుకుంది.

నిధుల లేమి ప్రధాన సమస్య...



నిధులు ఆశించిన మేరకు మంజూరు కాకపోవడం వల్లే అనుకున్న పనులు పూర్తిస్థాయిలో చేయలేకపోయాం. కరోనా వల్ల కొంత ఇబ్బంది కలిగింది. పాలక పక్షంలో ఉండటం వల్లే కొంతమేర అభివృద్ధి పనులు చేయగలిగాం. పలు సమస్యలపై తీర్మానాల ద్వారా ఉన్నతాధికారులకు నివేదించాం.

– చీమల నాగరత్నమ్మ, ఎంపీపీ, ఇల్లెందు